


# మళ్లీ విజృంభణ

- విస్తరిస్తున్న గుడుంబా వ్యాపారం
- కొంత కాలం స్తబ్దుగా ఉండి జోరందుకున్న దందా
- ఆరు మండలాల్లో యథేచ్ఛగా విక్రయాలు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ?



కృష్ణకాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుడుంబా మహమ్మారి మళ్లీ పురివిప్పింది. గ్రామాలనే కాకుండా పట్టణాల్లోనూ విస్తరిస్తోంది. ఎక్సైజ్ శాఖ అడపాదడపా దాడులు చేస్తున్నా తగ్గినట్టే తగ్గి, మళ్లీ విజృంభిస్తోంది. భూపాలపల్లి ఎక్సైజ్ పరిధిలో ఈ నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తెల్లవారుజామున మోటారు సైకిళ్ల, ఆటోల్లో బహిరంగంగానే రవాణా అవుతోంది. గుడుంబా తయారీకి ఉపయోగించే ముడి సరుకు సైతం జోరుగా దిగుమతి అవుతోంది. గుడుంబా తయారీదారులతో ఎక్సైజ్ అధికారులు, ముడి సరుకులు సరఫరా చేసే డీలర్లు కుమ్మక్కు కావడంతో ఈ దందాకు అడ్డూ అదుపులేకుండా పోతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

### పల్లెల నుంచి పట్టణాలకు..

పల్లెల్లో ఏరులై పారుతున్న గుడుంబా పట్టణాలకూ పాకుతోంది. భూపాలపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భూపాలపల్లి, గణపురం, రేగొండ, చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా తయారవుతోంది. అక్కడి నుంచి యథేచ్ఛగా ఇతర ప్రదేశాలకు జోరుగా రవాణా అవుతోంది. దీంతో వయసుతో నిమిత్తం లేకుండా అనేక మంది ఈ మహమ్మారికి అలవాటు పడుతున్నారు. దీనికి బానిసలై అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కొందరు సింగరేణి ఉద్యోగులు సైతం గుడుంబాకు అలవాటు పడి ఉద్యోగాలు సైతం సరిగా చేయడంలేదని వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### జోరుగా ముడి సరకుల దిగుమతులు

గుడుంబాకు తయారీకి బెల్లాన్ని తప్పనిసరిగా వాడే వారు. ప్రసుతం అది మార్కెట్‌లో సరిగా దొరకకపోవడంతో తయారీదారులు కొత్త విధానాల్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. చెక్కరతో పాటు ఈస్ట్‌తో గుడుంబాను తయారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఈస్ట్, చక్కెరను భారీగా దిగుమతులు చేసుకుంటున్నారని సమాచారం. వీటి విక్రయాలతో తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేగొండ మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఓ డీలర్ సరఫరా చేస్తున్న 10 కిలోల ఈస్ట్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి ఎక్సైజ్ పరిధిలో గుడుంబా తయారీకి ఉపయోగపడే ముడిసరుకు జోరుగా సరఫరా అవుతోందనడానికి ఇదే నిదర్శనమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### నామమాత్రంగా తనిఖీలు!

భూపాలపల్లి ఎక్సైజ్ పరిధిలో చేస్తున్న తనిఖీలు నామమాత్రంగానే మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. నాటుసారా తయారీ, విక్రయదారులపై నిఘా కఠినం చేశామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలుస్తోంది. గ్రామాలతో పాటు పట్టణాలకు సరఫరా అయ్యే గుడుంబాను కట్టడి చేయడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎక్సైజ్ శాఖలో కింది స్థాయి ఉద్యోగులు గుడుంబా విక్రయదారులకు వెన్నుదన్నుగా నిలుస్తుండగా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

### గడిచిన మూడు నెలల్లో ఇలా..

గత మూడు నెలల్లో ఎక్సైజ్ అధికారులు చేసిన కేసులే వారి అడపాదడపా తనిఖీలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. భూపాలపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. వీటిల్లో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల వరకు మొత్తంగా 121 కేసులు నమోదు చేసి 100 మందిని అరెస్టు చేశారు. అలాగే 635 లీటర్ల ఐడీ, 1450 లీటర్ల వాష్, 95 కేజీల షుగర్, 20 కేజీల జాగిరి, 10 కిలోల ఈస్ట్, 99 కేజీల ఆలంతో స్వాధీనం చేసుకొని 22 వాహనాలను మాత్రమే సీజ్ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే.. ఇవన్నీ నామమాత్రమేనని, క్షేత్రస్థాయిలో దీనికి ఎన్నోరెట్ల ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోందని తెలుస్తోంది.

# జూదంలా ఒప్పంద వ్యవసాయం

- విత్తనసాగులో రైతులను ముంచుతున్న ప్రైవేటు కంపెనీలు
- దిగుబడి రాక రైతులకు వరుస నష్టాలు
- ములుగు జిల్లాలో జోరుగా మిర్చి, మొక్కజొన్న సాగు
- గింజలు పొయ్యని కంకులు
- ఈసారి 2168 ఎకరాలలో నష్టం
- విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న కంపెనీల

6



మొక్కజొన్న చేనులో నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

# తాగునీటి ఎద్దడిని నివారించాలి

**అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి**

మహదేవపూర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ ఎల్.విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, ఉపాధి హామీ సిబ్బందితో ఆమె బుధవారం సమావేశమయ్యారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో లేబర్ బడ్జెట్ అప్రూవ్ చేసిన పని దినాల మేరకు టార్గెట్ ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీలకు పని కల్పించాలన్నారు. వేసవి తీవ్ర ఎక్కువ ఉన్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు పని ప్రదేశంలో కూలీలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. నూతన రేషన్ కార్డుల కోసం మీ-సేవలో చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి ఈ నెలాఖరులోగా మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యం ప్రకారం వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి , మహదేవపూర్ మండల ప్రత్యేక అధికారి ఎం.వీరభద్రయ్య, ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీవో మహేష్, ఏఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేయకపోతే.. తెలిసేదెలా?



వాతావరణ పరిస్థితులను, ముఖ్యంగా ఉష్ణోగ్రతను తెలిపేందుకు ప్రతీ కలెక్టరేట్‌లో ఎల్‌ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలోనూ ఓ ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను ఉంచారు. కానీ అది పని చేయడంలేదు. సాక్షాత్తు కలెక్టరేట్‌లో ఉన్న ఎల్‌ఈడీ స్ర్కీన్ పనిచేయకపోవడమేమిటని, మరమ్మతులు చేయకపోతే ఉష్ణోగ్రతలు ఎలా తెలుస్తాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

# అధికారులు అంకితభావంతో పనిచేయాలి

**కలెక్టర్ రాహుల్‌శర్మ**



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

గణపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అధికారులు అంకితభావంతో పనిచేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మండలంలో ఆయన బుధవారం పర్యటించారు. తహసీల్దార్ కార్యాల యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అధికారులు సమర్థంగా పనిచేసి ప్రజలకు సేవలు అందించాలన్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీ, తాగునీటి సమస్య, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రెవెన్యూ, వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులు రైతులు పండించే పంటకు సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, పంచాయతీ, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. అలాగే కేంద్రంలోని మోడల్ స్కూల్‌తోపాటు చెల్పూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లోని ఏర్పాట్లన పరిశీలించారు. ఇప్పటి వరకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఇదే స్ఫూర్తితో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

# కార్పొరేట్ సెలూన్లను అనుమతించొద్దు

**నాయీబ్రాహ్మణుల నిరసన**



ర్యాలీ నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులు

కృష్ణకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తమ ఉపాధికి విఘాతం కలిగిస్తున్న కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటుకు అనుమతినివ్వదని నాయీ బ్రాహ్మణులు నినదించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలి వద్ద నిరసన చేశారు. ఈ సంద ర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మంజూ ర్‌నగర్‌లో 'పింక్‌అండ్‌బ్లూ' అనే కార్పొరేట్ సంస్థ పేరుతో రష్యాకు చెందిన నాయీ బ్రాహ్మణేతర వ్యక్తి సెలూన్ షాపు ఏర్పాటు చేసే ప్రత్నిస్తున్నాడని తెలిపారు. ఇప్పటికే అతడు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాడన్నారు. ఇలాంటి కార్పొరేట్ సంస్థల వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తినే నమ్ముకున్న తాము ఉపాధిని కోల్పోతామన్నారు. ఈ కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజశేఖర్, మండల అధ్యక్షుడు మంథెన భూమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య జిల్లా గౌరవ సలహాదారు కురిమిళ్ల శ్రీనివాస్, మురారి శంకర్, వంగపల్లి సుదర్శన్, ముత్యాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటోను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు
- క్షతగ్రాతుల్లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్



వంద పడకల ఆస్పత్రిలో క్షతగాత్రులు



ప్రమాదానికి గురైన ఆటో

కృష్ణకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను కారు ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్రంగానూ, మరో ఇద్దరికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

భూపాలపల్లి బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మాదాసు తిరుపతమ్మ, 20వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ చల్లా రేణుకతో పాటు పట్టణానికి చెందిన బోడ రాంసింగ్, బోడ పద్మ, రాదండి ఉమ మంజూర్‌నగర్‌లో నివాసముండే తమ పరిచయస్తురాలు వెంకటలక్ష్మి ఇంట్లో దేవుడు కొలువు ఉండగా ఆటోలో అక్కడికి వెళ్లారు. తిరిగి భూపాలపల్లికి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిపై హెచ్‌పీ బంక్ వద్ద ఆటోలో పెట్రోల్ పోయించుకున్నారు. బయటకు వస్తున్న క్రమంలో వీరి ఆటోను ఓ కారు అతివేగంతో వచ్చి ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న తిరుపతమ్మ, చల్లా రేణుక, రాదండి ఉమలకు స్వల్ప గాయాలయ్యాయి. బోడ రాంసింగ్, బోడ పద్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. కారు నడిపే వ్యక్తి జిల్లా పోలీస్ విభాగంలోని సీసీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. ఘటన స్థలాన్ని భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తిపరిశీలించారు. వంద పడకల ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుల వివరాలను తెలుసుకున్నారు.

# ములుగు జిల్లాలో పెద్దపులి కలకలం

- భూపాలపల్లి అడవుల నుంచి పాకాల వైపు ప్రయాణం
- భయాందోళనలో లక్నవరం లోతట్టు గ్రామాలు



పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ములుగు/వెంకటాపూర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం సృష్టించింది. భూపాలపల్లి జిల్లా అటవీ గ్రామ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన పులి పాకాల వైల్డ్‌లైఫ్ రేంజ్ వైపునకు పయనమైంది. ఈ క్రమంలో తాడ్వాయి మండలం బయ్యక్కపేట, వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్, లింగాపూర్ మీదుగా బయల్దేరింది. మంగళవారం రాత్రి జాతీయ రహదారిని దాటిన పులి లక్నవరం చెరువు పరీవాహక అడవిలోకి ప్రవేశించింది. మంగళవారం సాయంత్రం లింగాపూర్ వద్ద పులిని చూసిన పశువుల కాపరి భయంతో పరుగులు తీశాడు. బుధవారం ఉదయమే ఆప్రాంతానికి వెళ్లిన అటవీ శాఖ ములుగు రేంజర్ డోలి శంకర్ ఆధ్వర్యంలోని సిబ్బంది పులి పాదముద్రలను పరిశీలించారు. మూడేళ్ల వయసున్న మగ పులి పత్తిచేలు, వరిపొలాలను దాటుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు గుర్తించారు. ములుగు మండలం సర్వాపూర్ దాటిన తర్వాత పాకాల వన్యప్రాణి సంరక్షణ అడవులు ప్రారంభ మవుతాయి. అక్కడి నీటి మడుగులు, వన్యప్రాణులు సంచరించే ఏడు ప్రదేశాలలో అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈఏడాది జనవరిలో సర్వాపురం అడవిలో ఓ అడవి పందిని వేటాడి చంపినట్లు గుర్తించామని, ఆతర్వాత పులి గుండాల మీదుగా కిన్నెరసాని వైపుకు వెళ్లిందని అటవీశాఖ అధికారులు చెప్పారు. పులి సంచారం నేపథ్యంలో లక్నవరం లోతట్టు గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఒంటరిగా బయటకు రావొద్దని, అడవిలోకి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.



# 'చిన్నకాళేశ్వరం' కెనాల్ భూసేకరణపై సర్వే

కాటారం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చిన్నకాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ధన్వాడ గ్రామ పరిధిలో కెనాల్ నిర్మాణం కోసం భూసేకరణపై బుధవారం అధికారులు సర్వే నిర్వహించారు. స్టేజ్-2 పంప్‌హౌజ్ కింద ఆదివారంపేట డెలివరీ సిస్టర్న్‌లో భాగంగా మెయిన్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణంలో భాగంగా గుమ్మళ్లపల్లి నుంచి ధన్వాడ వరకు 3కిలో మీటర్ల కెనాల్స్ నిర్మాణం చేయడానికి సుమారు 150ఎకరాలు భూసేకరణ సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే సాఫీగా జరిగేలా పీఎస్సై గీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ డీఏ రాములు, సర్వేయర్లు, సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

## వనదేవతలకు మొక్కులు

తాడ్వాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మలకు భక్తులు బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ చీరె సారె, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగు స్నానఘట్టాలపై ఏర్పాటు చేసిన నల్లాల కింద పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు ఇచ్చారు. అక్కడి నుంచి వనదేవతల గద్దెలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

### ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని వినతి

మేడారంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించుకుండా అరికట్టాలని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రంకు స్థానిక యువజన సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన భోజరావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌తోపాటు సభ్యులు కోరారు. ఈ మేరకు ఆయన వినతిపత్రం అందజేశారు.

## మేడారం హుండీల ఆదాయం రూ.1.08 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తాడ్వాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలకు చెందిన హుండీలను బుధవారం లెక్కించారు. మొత్తం 54 హుండీల ద్వారా రూ.1,08,03,173 ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఆదాయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి మార్చి 26వ తేదీ వరకు ఉన్న ఆదాయాన్ని లెక్కించగా.. ఇందులో ఫిబ్రవరి 12వ తేదీ నుంచి నాలుగు రోజులు నిర్వహించిన మినీజాతరకు వచ్చిన భక్తులు వేసిన కానుకలు అధిక మొత్తంలో ఉన్నాయి. పూజారుల సమక్షంలో ఈ లెక్కింపు జరగ్గా.. సమ్మక్కకు చెందిన 24 హుండీల ద్వారా రూ.58,66,409, సారలమ్మకు చెందిన 24 హుండీల్లో రూ. 45,61,892, పగిడిద్దరాజుకు చెందిన మూడు హుండీల్లో 1,61,003, గోవిందరాజుకు చెందిన మూడు హుండీల్లో రూ.2,13,869 వచ్చాయని మేడారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. మొత్తం ఖాళీ అయిన 54 హుండీల్లో 16 హుండీలను సీల్ చేసి గద్దెల వద్ద మళ్లీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, పూజారులు, సేవా సిబ్బంది, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 29న అంగడి వేలం

తొర్రూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో ప్రతీ మంగళవారం నిర్వహించే అంగడి వేలం పాటను ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. శనివారం మునిసిపాలిటీ ఆవరణలో తైబజారు, గంపచీటి అంగడి వేలాన్ని నిర్వహిస్తున్నామన్నారు. టెండర్‌లో పాల్గొనేవారు షెడ్యూల్ ధర రూ.3వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఈనెల 24న పశువులు, గొర్రెలు, మేకలు ఇతర టెండర్లు ముగిశాయని వాటి ద్వారా మునిసిపాలిటీకి రూ.32లక్షల ఆదాయం సమకూరిందని, గంపచీటి వేలం వాయిదా పడటంతో 29న తిరిగి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# జూదంలా ఒప్పంద వ్యవసాయం

- విత్తన సాగుతో రైతులను ముంచుతున్న ప్రైవేటు కంపెనీలు
- దిగుబడి రాక రైతులకు వరుస నష్టాలు
- ములుగు జిల్లాలో జోరుగా మిర్చి, మొక్కజొన్న సాగు
- గింజలు పొయ్యని కంకులు
- ఈసారి 2,168 ఎకరాలలో నష్టం
- విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న కంపెనీలు

ములుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు విత్తన కంపెనీతో కలిసి ఒప్పంద వ్యవసాయం చేస్తున్న ములుగు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట దిగుబడి రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ వ్యవహారంలో ఆర్గనైజర్లుగా వ్యవహరించే ఏజెంట్లు లాభపడుతున్నారు. మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన వెంకటాపురం మండలం చిరుతపల్లికి చెందిన రైతు లేకం మధుకృష్ణ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై రాష్ట్ర వ్యవసాయ కమిషన్ స్పందించింది. ఒప్పంద వ్యవసాయాన్ని విత్తన చట్టం పరిధిలోకి తీసుకురావడంతో పాటు రాబోయే రోజుల్లో విత్తన పంటలను సాగుచేసే రైతులకు రక్షణ కల్పించేలా చర్యలకు హామీనిచ్చింది.



గింజలు లేని కంకులను చూపిస్తున్న రైతు

ములుగు జిల్లాలోని గోదావరి పరీవాహకంలోని కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో సారవంత భూములున్నాయి. మేలు రకం విత్తనాలను ఉత్పత్తి చేసే క్రమంలో పలు కంపెనీలు ఇక్కడి రైతులతో ఒప్పందం చేసుకొని 20 ఏళ్లుగా మిర్చి, మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాయి. విత్తనాలు ఆ కంపెనీయే రైతుకు అందజేస్తోంది. సస్యరక్షణ చర్యల కోసం పురుగు మందులు, ఎరువులు సరఫరా చేయడంతోపాటు కూలీలకయ్యే ఖర్చులు కూడా భరిస్తుంది. కోత తర్వాత పంటనుతీసుకొని అగ్రిమెంటు ప్రకారం రేటు చెల్లిస్తుంది. ప్రపంచదేశాల్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు పేరెన్నికగన్న ఏవీటీ సంస్థ ఏటా వందలాది ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేయిస్తోంది. ఈ తరహాలోనే ఈసారి కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో సింజెంటా, బేయర్, షైటెక్ కంపెనీలు సుమారు 1,030 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కోసం రైతులతో ఒప్పందం చేసుకుంది. కానీ, విత్తనాలలో జన్యు పరమైన సమస్యలు తలెత్తడంతో ఆశించిన స్థాయిలో గింజలు రాలేదు.

### విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తూ...

పంట వేయడానికి ముందే సాధారణంగా కంపెనీలు రైతులతో ఒప్పందం చేసుకుంటాయి. క్వింటా చొప్పున రేటును నిర్ణయిస్తారు. పర్యవేక్షణ కోసం ఏరియాకో ఆర్గనైజర్‌ను నియమించుకుంటాయి. విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఈ తతంగమంతా జరుగుతుంది. పంట దిగుబడి రాకున్నా ఎరువులు, పురుగు మందులు ఫెయిల్ అయినా న్యాయపరమైన సమస్యలు ఎదురుకాకుండా కంపెనీల ఆర్గనైజర్లు వ్యవహరిస్తారు. గతంలో సరైన దిగుబడి రాకపోవడంతో పరిహారం చెల్లించాల్సిన కొన్ని కంపెనీలు ముఖం చాటేశాయి. చట్టప్రకారం ఒప్పందం లేకపోవడంతో రైతులు ఏం చేయలేకపోయారు. ఈసారి మూడు కంపెనీలు రైతులకు మొక్కజొన్న విత్తనాలు ఇవ్వగా అనూహ్యంగా విత్తనాలు ఫెయిల్ కావడంతో రైతులు తలలు పట్టుకున్నారు. వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాలు 1/70 చట్టం పరిధిలోకి వస్తాయి. ఇక్కడ గిరిజనేతరులకు భూములపై ఎలాంటి హక్కులు ఉండవు. మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన వారిలో ఎక్కువ మంది వారే ఉన్నారు. క్వింటా మొక్కజొన్నకు రూ.3,600 చెల్లించే విధంగా కంపెనీ ప్రతినిధులు రైతులతో మాట్లాడుకున్నారు. విత్తనాలు ఫెయిల్ కావడంతో 10శాతం కూడా పంట చేతికి రాలేదు. ఈ క్రమంలో రైతులకు పరిహారంచెల్లింపు విషయంలో ఆకంపెనీ ప్రతినిధుల నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడంతో రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. స్పందించిన కలెక్టర్ దివాకర వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే చేయించారు. జిల్లా వ్యవసాయాధికారి సురేష్ పర్యవేక్షణలో ఏడు బృందాలు క్షేత్ర స్థాయిలో రైతుల వివరాలను సేకరించాయి. తెలంగాణ విత్తన సర్టిఫికేషన్ ఏజెన్సీకి చెందిన నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలన జరిపి విత్తనాల నమూనాలను తీసుకుంది. 959 మంది రైతులకు చెందిన 2,168 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేశారు.

**వ్యవసాయ కమిషన్ సీరియస్**

మక్కలు సాగు చేసిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడటం, రోజులు గడుస్తున్నా ఆయా కంపెనీలు పరిహారాన్ని తేల్చకపోవడంతో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సీరియస్ అయ్యింది. కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో సమావేశమయ్యారు. ఎకరాకు రూ.లక్షన్నర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అయితే.. విత్తన కంపెనీల నుంచి సానుకూల స్పందన రాలేదు. అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా త్వరలోనే నిర్ణయం వెలువరిస్తామని, నష్టపోయిన రైతులకు పూర్తిసాయిలో పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని కోదండరెడ్డి ఇచ్చిన హామీ రైతుల్లో భరోసానిచ్చింది. ఒప్పంద వ్యవసాయాన్ని విత్తన చట్ట పరిధిలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని, ప్రైవేటు కంపెనీల చేతిలో రైతులు దగా పడకుండా రక్షణాత్మక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి స్పష్టం చేశారు.



మొక్కజొన్న చేనులో నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు (ఫైల్)

### రాజకీయ నాయకుల దళారీ అవతారం

రాజకీయ, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు కంపెనీ ఆర్గనైజర్ల పేరుతో దళారీ అవతారం ఎత్తారు. ఆయా విత్తన కంపెనీలు సూచించే ఎరువులు, పురుగు మందుల వీరే సరఫరా చేస్తున్నారు. మొదట ఉద్దెరకు ఇచ్చి పంటపై అసలుకు 5 నుంచి 10శాతం వడ్డీలు వసూలు చేస్తున్నారు. మధ్యవర్తిత్వం చేస్తూ కంపెనీ ఫలాలు రైతులకు చేరకుండా దోచుకుంటున్నారు. ఆశించిన మేరకు దిగుబడి రాకుంటే పంట అమ్మగా వచ్చే డబ్బులు దళారుల అప్పుకే సరిపోతున్నాయి. ఒప్పంద వ్యవసాయం చేసే రైతులు నష్టాలపాలవుతుంటే ఆర్గనైజర్లు మాత్రం ఏటేటా సంపదను పెంచుకొని ధనవంతులవుతున్నారు. కాగా, ఈ పంట సీజన్‌లో నష్టపోయిన రైతులు దళారుల దోపిడీని భరించలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంకటాపురం, మంగపేట మండలాలకు చెందిన ఇద్దరిపై ఏటూరునాగారం సబ్ డివిజన్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిన్నగూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నగూడూరు మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ప్రజలకు సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వేడి సంబంధిత అనారోగ్యాల గురించి మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు బయటకు రాకూడదని సూచించారు. తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు, ఎస్సై ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, వలీవుద్దీన్, సుమలత, సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఐదవ బెటాలియన్‌ను తనిఖీ చేసిన డీఐజీ

గోవిందరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలోని ఐదో స్పెషల్ పోలీస్ బెటాలియన్‌ను తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఐజీ సి.సన్నీ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా బెటాలియన్ కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం ఆయనను మొక్కను అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి ఈ సందర్భంగా డీఐజీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం బెటాలియన్‌లోని పలు రికార్డులను పరిశీలించి కమాండెంట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ సన్నీ

# ‘భూ భారతి’తో రెవెన్యూ శాఖ బలోపేతం

- గ్రామస్థాయిలో మెరుగైన సేవలు
- రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి 33 సెక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సాధించుకున్నాం
- 10,954 గ్రామ పాలన అధికారుల నియామకం
- తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

ములుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం అవుతుందని, విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ములుగులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. లచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 33 సెక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సాధించుకున్నామన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఈ భూ భారతి అమలు కాబోతోందని, 10,954 గ్రామ పాలన అధికారుల నియామకం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించేందుకోసం రెవెన్యూ ఉద్యోగులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. భూభారతి చట్టంతో తహసీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెకర్‌లకు అధికారాలు లభిస్తాయని చెప్పారు. సీసీఎల్ఏ నుంచి గ్రామపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందని తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందని, పాలకుల సహకారంతో ప్రజా సంక్షేమానికి పునరంకితం కావాలని కోరారు. గత ప్రభుత్వంలో 317 జీవో ఉద్యోగుల జీవితాలను ఛిన్నాభిన్నం చేసిందని, ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలు చెట్టుకొకరు పుట్టకొకరిగా వేర్వేరుచోట్ల పోస్టింగ్ ఇచ్చారన్నారు. ప్రస్తుతం జీవో నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వం సడలింపునిచ్చిందని, స్పౌజ్, మెడికల్, ఇతర బదిలీలకు అవకాశం కల్పించిందని తెలిపారు. వీఆర్‌వోలు, వీఆర్ఏలను మాతృశాఖలోకి తీసుకోవడం, తహసీల్దార్లు, ఆర్డీవోలు, జేసీలు గతంలో కోల్పోయిన అధికారాలను తిరిగి సాధించుకోవడం, భూ భారతి-2025 చట్టాన్ని పునరుద్ధరించుకోవడం రెవెన్యూ శాఖ సాధించిన విజయాలని లచ్చిరెడ్డి తెలిపారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బానాల రాంరెడ్డి, వి.భిక్షం, ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, రాథోడ్ రమేష్, ఉద్యోగసంఘం నాయకులు ఫూల్ సింగ్, పి.రాధ, సుజాతచౌహాన్, కృష్ణచైతన్య,ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## భూ తగాదాలో రాళ్లతో కొట్టుకున్న ఇరువర్గాలు

- భయాందోళనకు గురైన పట్టణ ప్రజలు

తొర్రూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకుని తీవ్రంగా గాయపర్చుకున్న సంఘటన మంగళవారం రాత్రి తొర్రూరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని అమ్మాపురం గ్రామ శివారు జీకే తండాకు చెందిన బిచ్చా, రమేష్ కుటుంబ సభ్యులకు కొంత కాలంగా ఇంటి వద్ద ఉన్న భూమిలో నిర్మించిన గోడ పంచాయితీ ఉంది. మంగళవారం బిచ్చా కుటుంబ సభ్యులు ఎల్లమ్మ పండుగ చేసుకుంటుండడంతో రమేష్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని గొడవపడ్డారు. ఈక్రమంలో వారు బిచ్చా, అతని భార్య భద్రమ్మ దంపతులపై గొడ్డలితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. తొర్రూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా రెండు కుంటుంబాలు పట్టణంలోని అన్నారం రోడ్డులో ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకుని బీభత్సం సృష్టించారు. మంగళవారం వారాంతపు సంత కావడంతో రోడ్లపై వెళ్తున్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ గొడవలో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.



రాళ్లతో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

## కొత్తూరు(సి)లో తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

సీరోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సీరోలు మండలం కొత్తూరు(సి)లో తల్లి, కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బత్తిని సరోజనకు మాటలు రావని గ్రామంలోనే ఉంటూ కూలీ పనికి వెళ్లి జీవనం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కొడుకు శేఖర్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడని, 15రోజుల క్రితం హైదరాబాద్ నుంచి భార్యపిల్లలతో కొత్తూరుకు వచ్చాడని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మద్యం తాగుతున్నాడని, గ్రామానికి వస్తే మద్యం తాగడం మానేస్తాడేమోనని ఇక్కడికి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం మానుకోటకు పనికి వెళ్లిన శేఖర్ వచ్చిన డబ్బులతో పురుగుల మందుకొని కూల్‌డ్రింకులో కలుపుకొని తాగి, మిగిలినది తల్లి సరోజనకు ఇవ్వగా ఆమె కూడా తాగినట్లు పేర్కొన్నారు. ఇరువురికి నోట నుంచి నురుగులు వస్తుండగా గమనించిన పక్కింటి వాళ్లు నోటి నుంచి పురుగుల మందు వాసన రావడంతో వెంటనే 108కు ఫోన్ చేయగా సరోజన, శేఖర్‌లను అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**వరంగల్ మార్కెట్ ధరలు** (రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2051 | 1521 |
| పల్లికాయ (సూక) | 6050 | 5500 |
| పల్లికాయ (పచ్చిది) | 4300 | 2400 |
| కందులు | 6921 | 3022 |
| పెసళ్లు | 7251 | 3022 |
| పత్తి | 7010 | 5300 |
| పసుపు (కాడి) | - | - |
| పసుపు (గోల) | - | - |
| తేజ మిర్చి | 12800 | 9500 |
| డిడి | - | - |
| వండర్‌హాట్ | 15500 | 12000 |
| ఎల్లో మిర్చి | - | - |
| యూఎస్341 | 12200 | 9000 |
| దేశీ | 28000 | 18000 |
| సింగిల్‌పట్టి | 29000 | 20000 |
| దీపిక | 13000 | 10000 |
| తాలు మిర్చి | 5000 | 2500 |

- వరంగల్ వ్యవసాయం

# తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు

- తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్

నర్సింహులపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ చౌకదారు దుకాణాల్లో తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల(లీగల్ మెట్రాలజీ) జిల్లా అధికారి కె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నర్సింహులపేట మండల కేంద్రంలో మండల పరిధిలోని అన్ని రేషన్ షాపుల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాంటాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెక్నీషియన్‌లతో కాంటాలను సవరణ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 650 రేషన్ దుకాణాలు ఉన్నాయన్నారు. ప్రతీ రోజు రెండు మండలాల చొప్పున రేషన్ దుకాణాలను సందర్శించి ఎలక్ట్రానిక్ కాంటాలను సవరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 8 మండలాల్లో పర్యాటన పూరైందని, ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయిలో అన్ని మండలాల్లోని కాంటాలను సవరణ చేస్తామన్నారు. రేషన్ డీలర్లు అందుబాటులో ఉండి ఎలక్ట్రానిక్‌కాంటాలను సవరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సురేష్, సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

- పెద్దవంగర: తూకాల్లో రైతులను, వినియోగదారులను మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల జిల్లా అధికారి సుంకరి విజయ్‌మార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రేషన్ షాపు కాంటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ దుకాణదారుడు లైసెన్స్ రెన్యువల్‌తో పాటు తరాజు, తూకం రాళ్లకు ప్రభుత్వ సీల్ వేయించుకోవాలని సూచించారు. తూనికలు, కొలతల్లో అక్రమాలు జరుగుతున్నట్లు వినియోగదారుడు గమనిస్తే నేరుగా తూనికల, కొలతల అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నింబధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



నర్సింహులపేటలో రేషన్ షాపుల ఎలక్ట్రానిక్ కాంటాలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

# పండిత, పామర జనరంజకం.. నాటకం

**నేడు ప్రపంచ నాటక (రంగస్థల) దినోత్సవం**

- కాకతీయుల కాలం నుంచే ఓరుగల్లులో రంగస్థల ప్రస్థానం
- ఊపిరిలూదిన నాటక సమాజాలెన్నో..
- ఎందరో నటులు, రచయితలు, ప్రయోక్తలకు నిలయంగా కళల కాణాచి

హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అందమైన, ఆకర్షణీయమైన ఆహార్యం, హృద్యమైన అభినయాదుల ద్వారా పండిత పామర జనరంజకమైంది నాటకం. కాకతీయులకు పూర్వం నుండే ఓరుగల్లు రంగస్థల ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఓరుగల్లు నాటక ప్రద్శనలను ప్రస్తావించాడు. విద్యానాథుడు తన ప్రతాపరుద్ర యశోభూషణంలో అంతర్నాటకాన్ని రచించాడు. ప్రతాపరుద్రుడే స్వయంగా యయాతి చరిత్ర అనే సంస్కృత నాటకాన్ని రాశాడు. వరంగల్‌లోని ప్రాచీన దేవాలయాల్లోని రంగమంటపాలు, విశాలమైన వేదికలు ఆనాటి రంగస్థల ప్రదర్శనకు ఉపయోగించినవేనని తెలుస్తున్నది. తురుష్కుల పాలనలో యక్షగానాలు భాగవతాలు, వీధి నాటకాలు, లేదా బయట నాటకాలు అనే పేరుతో వరంగల్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించబడ్డాయి. నిజాం కాలంలో సైతం వరంగల్ సుభా (ప్రస్తుతం సుబేదారి)లో రంగ స్థల నాటక ప్రదర్శనలు జోరుగా జరిగాయి. నేడు ప్రపంచ నాటక (రంగస్థల) దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో రంగస్థల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.



ఇటీవల కాళోజీ కళాక్షేత్రంలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

### రంగస్థల వేదిక నందయ్య దొడ్డి..

19వ శతాబ్దంలో వృత్తి నాటక సమాజాలు వచ్చాయి. కళాకారులు ఊరూరా తిరిగి నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ధార్వాడ కంపెనీ, గబ్బి వీరన్న కంపెనీ, సురభి నాటక సమాజాలు ప్రదర్శించిన అనేక నాటకాలకు నాడు వరంగల్ కేంద్రంగా నిలిచింది. వరంగల్ జేపీఎన్ రోడ్డులోని నందయ్యగారి దొడ్డిలో ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై అనేక నాటక ప్రదర్శనలు జరిగేవి. వరంగల్ హిందీ నాటకాలకు కూడా వేదికైంది. అప్పటి ప్రముఖ పారిశ్రామి కవేత్త డిడి ఇటాలియా ఆహ్వానం మేరకు ఆరోజుల్లోనే ప్రముఖ రంగ స్థల సినీ నటులు, దర్శకులు పృథ్విరాజ్, షోహరాబ్ మోడీ తమ బృందంతో వచ్చి నాటక ప్రదర్శనలు ఇచ్చారు. హనుమకొండ వడ్డెపెల్లిలో పింగిళి వెంకట్రాం రెడ్డి ప్రోత్సాహంతో గద్దె సాంబయ్య, శెట్టి వైకుంఠం, ముదిగొండ రాం ప్రసాద్ నట బృందాలు వరుసగా పౌరాణిక, పద్యనాటక ప్రదర్శనలెన్నో ఇచ్చారు. హనుమకొండ జాతికి ఊపిరి స్వాతంత్రం అనే రూకం 200 మంది కళాకారులతో 40 రోజుల పాటు ప్రదర్శించారు. వేలాది మంది ప్రజలు ఈ రూపకాన్ని తిలకించారు. నాటక ప్రదర్శనల్లో ఇదొక అరుదైన రికార్డు.

### భారతీయ నాటక కళా సమితి

ఓరుగల్లు నాటక రంగానికి పట్టుగొమ్మగా నిల్చి నేటికీ సేవలందిస్తున్న భారతీయ నాటక కళాసమితి 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఏర్పాటయింది. ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల అంజనేయులు, వనం లక్ష్మీకాంతారావు దీని వ్యవస్థాపక సభ్యుల్లో ముఖ్యులు. నాటక రంగాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటైన ఈ సంస్థ అల్లూరు సీతారామరాజు నాటక ప్రదర్శనతో విరాళాలు సేకరించేందుకు పూనుకుంది. ఈ నాటక ప్రదర్శన కార్యక్రమంలో మునుగోటి నర్సయ్య గుప్త రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ విరాళం, నాటక ప్రదర్శన ద్వారా వచ్చిన డబ్బు, ప్రభుత్వం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్‌తో రంగస్థల ప్రదర్శనలకు కావా ల్సిన అన్ని హంగులతో ఆడిటోరియం నిర్మిం చారు. నాలుగు దశాబ్దాలుగా క్రమం తప్ప కుండా రాష్ట్ర స్థాయి నాటక ప్రదర్శ నలను నిర్వహిస్తోంది.

### సహృదయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ

డా.ఏవీ నర్సింహారావు, వనం లక్ష్మీకాంతారావు, దర్శయనం శేషాచార్య, జి.గిరిజా మనోహర్ బాబులు 1996లో దీనిని స్థాపించారు. మూడు దశాబ్దాల సాహిత్య సాంస్కృతక కార్యక్రమాల నిర్వహణలో ఎన్నోమైలు రాళ్లను అధిగమించింది. హనుమ కొండ వేదికగా అంతర్ రాష్ట్ర స్థాయిలో ఆహ్వాన నాటక పోటీలను నిర్వహిస్తున్నది. భావితరాలు నాటక కళను కొనసాగించే దిశగా బాలల నాటక పోటీలను కూడా నిర్వహిస్తోంది.

### చైతన్య కళా సమాఖ్య..

తొర్రూరులోని చైతన్య కళాసమాఖ్య కూడా నాటక రంగాన్ని బతికించేందుకు తన వంతు కృషి చేస్తోంది. 25 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ కళా సంస్థ ప్రతీ ఏటా క్రమం తప్పకుండా రాష్ట్ర స్థాయి నాటకాలను నిర్వహించి తద్వారా రంగ స్థల కళాకారులను ప్రోత్సహిస్తోంది. నాటక ప్రదర్శనలకు సొంతంగా ఒక ఆడిటోరియం కూడా సమకూర్చుకున్న ఈ సంస్థ రంగ స్థల కళాకారుల సంక్షేమానికి ఇతోధికంగా కృషి చేస్తోంది.



ఓ సన్నివేశంలో నటిస్తున్న కళాకారులు

### కాకతీయ కళా సమితి..

పాములపర్తి సదాశివరావు 1942లో కాకతీయ కళా సమితిని స్థాపించి అనేక నాటక ప్రదర్శనలు ఇప్పించారు. ఈ సమితి ప్రదర్శించిన నాటకాల్లో చంద్రగుప్త, మధుసేవ, ప్రతాపరుద్రీయం, ఖిల్జీ రాజ్యపతనం ఉన్నాయి. కాకతీయ కళా సమితితో నటుడుగా పేరుపొందిన రఘుపతిని పృథ్వీరాజ్ కపూర్ బొంబాయి పిలిపించుకొని తన నాటకా ల్లో నటింప చేశారు. త తర్వాత వచ్చిన డాక్టర్ బుచ్చిరాజు శారద నాట్య మండలి, ముచ్చర్ల సత్యనారాయణ వాణీ నికేతన్ నాట్య మండలి నాటక సమాజాలు కూడా వరంగల్‌లో నాటకాలకు జీవం పోశాయి. పద్య నాటకం పట్ల అభిమానం ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు ములుగు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఒక వర్క్‌షాపు తమ కార్యస్థానంగా చేసుకొని తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్‌గా ఏర్పడి ఏటా పది నాటకాలకు తగ్గ కుండా పద్యనాటకాలను ప్రదర్శించారు. వరంగల్‌లో రంగస్థల విస్తృతికి విశేషంగా కృషి చేసిన సంస్థల్లో ప్రేక్షక సభ ఒకటి. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంస్థ నాటక ప్రదర్శనలను ప్రోత్సహించడమే కాకుండా లబ్ధప్రతిష్ఠులైన రంగస్థల నటులను ఆహ్వానించి వర్క్‌షాపుల ను నిర్వహించింది. రాష్ట్ర స్థాయిలో కళాకారుల సమస్యలను పరిష్కరిం చేందుకు ఏర్పడిన సంస్థ ఇది. 1999లో నేరేళ్ల వేణుమాధవ్ గౌరవాధ్యక్షు డిగా, భండారు ఉమామహేశ్వర్ రావు వ్యవస్థాప అధ్యక్షులుగా ఏర్పాట యింది. ఈ సంస్థ తెలంగాణ స్థాయి నాటక పోటీలను నిర్వహించ డమే కాకుండా రంగస్థల కళాకారుల సమస్యలపై పోరాడుతోంది.

### పద్య నాటకాల జోరు..

1950 తర్వాత పద్యనాటకాలకు ఆదరణ పెరిగింది. ఆజంజాహి మిల్స్ ఆర్ట్స్ అసోసియేషన్, మంజూ ఆర్ట్స్ అసోసియేషన్, మారుతీ నాట్య మండలి, హిందూ డ్రమెటిక్ అసోసియేషన్, శ్రీ రాజరాజేశ్వరీ నాట్య మండలి, శ్రీ శారదా నాట్య మండలి తదితర నాట్య మండళ్లు వందలాది పద్యనాటక ప్రదర్శనలిచ్చాయి. ఇవి ప్రదర్శిం చిన వాటిలో రామదాసు, ప్రతాపరుద్రీయం, వర విక్రయం, చింతామణి, సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం, ఉద్యోగ విజయాలు, శ్రీ రామాంజనేయ యుద్ధం, లవకుశ విశేషాదరణ పొందాయి.

### రంగస్థల ప్రముఖులు..

వరంగల్ వేదికగా అనేక నాటక ప్రదర్శనలిచ్చి అనేక మంది పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. పాలెం రఘుపతి, పగడాల త్యాగరాజు, చాట్ల శ్రీరాములు, బీవీ రంగారావు, మెహర్బాన్ అలీ, విజయకుమార్ (విజ్జీ), నంది రాజారెడ్డి, డాక్టర్ రమణ తదితరులు ఎందరో ఉన్నారు. త్యాగరాజు అనేక సినిమాల్లో విలన్‌గా రాణించారు. కక్కెర కొమురయ్య, ఎస్కే గౌడ్, జనగామకు చెందిన గంగిశెట్టి చిరంజీవులు, కె.జయకర్‌రావు, కాశీపేట తరుమలయ్య, వొల్లాల నర్సయ్య గౌడ్, నాంపల్లి మధుబాబు, కాసర్ల మధుసూదన్ రావు (మధు), సిరికొండ మాధవరావు, తుమ్మ రవీందర్, సుంకనపల్లి రాజ్‌కుమార్, పి. శేఖర్ బాబు తదితరులు ఎందరో తమ నటన ద్వారా నాటకరంగానికి ఊపిరులు ఊదారు.

### ప్రయోక్తలుగా...

చాట్ల శ్రీరాములు అనేక నాటకాల్లో నటించి గొప్ప నటుడుగా పేరుపొందడమే కాకుండా పలు నాటకాలు రచించి, దర్శకత్వం కూడా వహించారు. పిఎస్ విజయకుమార్, పాలెం రఘుపతి, మర్రిరెడ్డి లాంటి దర్శకులెందరో రంగస్థలమే ఊపిరిగా జీవించారు. తూము రామదాసు, శేషాద్రి వెంకటరమణ కవులు, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ వనం మధుసూదన్, అంకం లింగమూర్తి వంటి నాటక రచయితలు భిషగ్విజయం వంటి ప్రతీకాత్మక నాటకాలు, కొత్త రచనా ప్రయోగంతో వచ్చిన అమ్మయ్యో గాంధీ బ్రతికాడు లాంటి నాటక ప్రదర్శలతో రంగస్థలానికి నూతన ఒరవడులు దిద్దారు. ఎస్ఎన్ చారిగా సుపరిచితులైన సిద్దోజు నరసింహాచారి నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా, రచయితగా కళాలోకంలో ప్రత్యేక చోటు సంపాదించుకున్నారు. విధివ్రాత అనేక నాటకంలో సుగుణ పాత్ర వేయడంతో ఈయన నటజీవితం ప్రారంభమైంది. తాను స్వయంగా నటించి దర్శకత్వం వహించిన నాటకాల్లో అంతర్వాణి, అల్లిముఠా, కనువిప్పు, రెండు ఇంటు రెండు ఆరు, దేవతలెత్తిన పడగ, ప్రతాపరుద్రీయం మొదలైవని ఉన్నారు.

### అందుబాటులో పలు వేదికలు

గతంలో నాటకాలను ప్రదర్శించేందుకు అనువైన వేదికలు ఉండేవి కావు. దీంతో కళాకారులు నాటకాలు ప్రదర్శించేందుకు ఇబ్బందులు పడేవారు. వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో దానికి ఎదురుగానే పోతన ఓపెన్ థియేటర్ నిర్మాణం జరిగింది. ఇక్కడ కొన్నాళ్ల నాటకాలను ప్రదర్శించారు. కానీ ఇందులో సౌకర్యాలు లేకపోవడం తర్వాత అది కనుమరుగు కావడంతో మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యాయి. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నేరేళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం పేరుతో వేదిక అందుబాటులోకి వచ్చిన తర్వాత కళాకారులకు కొంత ఊరట కలిగించింది. ప్రస్తుతం రూ.70 కోట్ల వ్యయంతో హయగ్రీవాచారి గ్రౌండ్‌లో అన్ని హంగులతో కూడిన ఆధునాతన వేదిక కాళోజీ కళాక్షేత్రం అందుబాటులోకి రావడంతో నాటక ప్రదర్శనలకు కొత్త ఊపిరి అందినట్లయింది. ఇటీవలే ఇందులో సహృదయ సంస్థ రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహించింది.

**నాటక సమాజాలు**

తర్వాత కాలంలో నాటకాల పట్ల అభిరుచి ఉన్నవారు ఒక్కదగ్గర చేరి నాటక సమాజాలను ఏర్పాటు చేసి నాటకాలను ప్రదర్శించించడం ప్రారంభించారు. అలాంటి వాటిలో వరంగల్ కాకతీయ కళాసమితి, వర్ధన్నపేట భారతీయ నాటక కళా సమితి, జనగామ జ్యోతిర్మయి డ్రమెటిక్ అసోసియేషన్, డోర్నకల్ శ్రీరామ కళాపరిషత్తు, కాజీపేట కళా సమితి, హనుమకొండలో సహృదయ సాహిత్య సాంస్కృతిక సం్థ, ప్రేక్షక సభ చెప్పుకోదగ్గవి. వీటిలో కొన్ని కనిపించరేండా పోయినా భారతీయ నాటక కళాసమితి, సహృదయ వంటి సంస్థలు ఇప్పటికీ రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహిస్తు నాటకాన్ని బతికిస్తున్నాయి.

**కొత్తపోకడలు..**

వరంగల్‌లో నాటక రంగం పలు కొత్త పోకడలు పోయింది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా, మారుతున్న కాలానికి అనుగుణంగా నాటక ప్రదర్శనలను మలిచారు. సౌండ్ అండ్ లైట్ సిస్టమ్, భారీ సెట్టింగ్‌లతో నాటకాలను ప్రదర్శించారు. రాణిరుద్రమదేవి, సమ్రాట్ ప్రతాపరుద్ర, కాకతీయ వైభవం లాంటి నాటకాలను భారీ సెట్టింగ్‌లతో ప్రదర్శించారు. కాకతీయ ఉత్సవాల్లో ఇవి ప్రత్యేక ఆదర్శణగా నిలిచాయి. 2002లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో ప్రదర్శించిన మూడవ పాదం నాటకానికి నంది అవార్డు తెలుగు నాటక రంగంలో వరంగల్‌కు ఉన్న స్థానం ఏమిటో స్పష్టమవుతుంది.

---

## ఉగాది కవి సమ్మేళనం

## ముందే కూస్తున్న కవితాగానం!

- నేడు, రేపు నగరంలో కవి సమ్మేళనాలు
- మొదలైన ఉగాది సందడి

హనుమకొండ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశ్వవసు ఉగాది వేడుకలు ఈసారి నగరంలో ముందస్తుగానే మొదలయ్యాయి. యేటా ఉగాది పర్వానికి ప్రత్యేకమైన పంచాంగ పఠనాలు, కవి సమ్మేళనాలకు నగరంలోని పలు సంస్థలు సమాయత్తం అయ్యాయి. వరంగల్ దర్శిన్ ఆధ్వర్యంలో వరంగల్ దర్శన్ ఆధ్వర్యంలో విశ్వవసు నామ ఉగాది వేడుకలు గురువారం సాయంత్రం 5 గంటలకు నక్కలగుట్టలో జరగనున్నాయి. బ్రహ్మశ్రీ జగన్‌మోహన్‌శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనంతోపాటు పది మంది కవులు పాల్గొనే కవి సమ్మేళనం, ఉగాది పచ్చడి లాంటి సంప్రదాయ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు పెండెం రమేశ్‌బాబు చెప్పారు. అలాగే హనుమకొండలోని ప్రసిద్ధ రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయం త్రమే ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ కవి సమ్మేళనం సుమారు 20 మంది కవులు పాల్గొని ఉగాది కవితాగానం చేయనున్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ ఏషియన్‌మాల్ సమీపంలోని షిరిడీ సాయి బాబా వేడుకల మందిరంలో ఉగాది కవి సమ్మేళనంతో పాటు పెద్దఎత్తున ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ ప్రధాన నిర్వాహకుడు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ చెప్పారు. భాషోపాధ్యాయ సంస్థ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే ఈ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ డీఈవోలు జ్ఞానేశ్వర్, వాసంతిలతోపాటు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఈసారి తెలుగు, హిందీతో పాటు ఆంగ్ల భాషా ప్రావీణ్యులను పలువురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరింపజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విశ్వవసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. డాక్టర్ కంఠెం లక్ష్మీనారాయణ, పాలకుర్తి లక్ష్మీనర్సింహమూర్తిశర్మ లాంటి పండితులను సత్కరిస్తామని ప్రత్యేక పంచాంగ శ్రవణం నిర్వహిస్తామని వారు చెప్పారు. ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేళ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పంచాంగ పఠనం ప్రత్యేక కవి సమ్మేళనం కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. వరంగల్‌లోని పద్మశాలీ ఫంక్షన్ హాలులో కృష్ణవేణి కళాసమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5గంటలకు ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పట్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈసారి ఉగాది పర్వానికి ముందే పలు సంస్థలు ఉగాది కవి సమ్మేళనాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తుండటం విశేషం. సహృదయ ఆధ్వర్యంలో కూడా ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహర్ తెలిపారు.



నరేంద్రాంధ్ర భాషా నిలయం

---

## కాళేశ్వరానికి కొత్త శోభ

- మంత్రి చొరవతో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు

మహదేవపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : త్రివేణి సంగమమైన కాళేశ్వరానికి కొత్త శోభ సంతరించుకుంటోంది. తెలంగాణలో జరుగనున్న సరస్వతీ పుష్కరాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో రూ. 25 కోట్లను విడుదల చేసి అభివృద్ధి పనులకు ముందడుగు వేసింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో త్రివేణి సంగమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. వేసవి కాలం కావడంతో భక్తులకు నీడ ఉండే విధగా చలువ పందిళ్లు, తాగునీటి వసతి, జల్లు, స్నానాలకు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఆలయంలో భక్తులు దర్శనానికి క్యూ లైన్లు, సరిపడా ప్రసాద విక్రయ కేంద్రాలు, తదితర ఏర్పాట్లను చురుగ్గా చేపడుతున్నారు. పుష్కర ఘాట్లలో భక్తుల స్నానాలుకు వీలుగా గాట్ల నిర్మాణం జరుగుతుంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న రోడ్లన్ని సీసీ రోడ్లుగా మారుతున్నాయి. భక్తులకు సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఆలయంలో చిన్నా చితక మరమ్మతు పనులను సైతం పూర్తి చేస్తున్నారు.



కాళేశ్వర పరిసరాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

---

## ఎంజాయ్.. రంజాన్

- పర్వదినానికి అందుబాటులో అందమైన దుస్తులు
- మహిళలు, యువతులు, చిన్నారుల కోసం ప్రత్యేక మోడళ్లు
- మండిబజార్‌తో సహా కిటకిటలాడుతున్న పలు దుకాణాలు



చుడీదార్లను కొనుగోలు చేస్తున్న ముస్లిం యువతులు

కరీమాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష పాటించి.. పండుగ రోజున ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పండుగను సంతోషంగా జరుపుకుంటారు. రంజాన్ నెల వచ్చిందంటే షాపింగ్ మాల్స్ వారు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తారు. ఒక చీర కొంటే మరొకటి ఫ్రీ అంటూ ఆకర్షించే ప్రయత్నాలు చేస్తుంటారు. అదేవిధంగా యువత నూతన వస్త్రాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కొందరు రెడీమేడ్ డ్రెస్సులపై ఆసక్తి కనబరిస్తే, మరి కొందరు మంచి డ్రెస్ మెటీరియల్ తీసుకొని వాటికి ఆకర్షణీయమైన వర్క్‌లు చేయించుకుంటారు. కానీ ఎక్కువ మంది చుడీదార్‌లకే ప్రాధాన్యమిస్తారు. ఇందులో పటియాలా, బాజీరావు మస్తానీ, రకాలతో పాటు అనేక మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. యువతులను మురిపిస్తున్న మరో డ్రస్ లాంగ్ ఫ్రాక్. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ముస్లిం యువతులు లంగా ఓణీలకే మొగ్గు చూపుతున్నారు. వీటిలో సిల్క్, హాఫ్ పట్టు, బెనారస్, తదితర మోడళ్లున్నాయి.

### అతివలకు అందాన్నిచ్చే ఫ్యాన్సీ హారాలు

రంజాన్ పండుగ సందర్భంగా చిన్నారుల దగ్గరినుంచి యువతులు, మహిళలు, అంతా కూడా డ్రెస్సులతో పాటు ఆభరణాలకు కూడా ప్రాధాన్యమిస్తారు. ఇందులో డ్రెస్సులకు సరిపడే ఫ్యాన్సీ హారాలను ధరిస్తుంటారు. వీటిలో స్టోన్‌వర్క్‌తో పాటు, పూసలు, సాదా హారాలు కూడా ఉంటాయి. చిన్నారులు, యువతులు, పూసలు, స్టోన్ వర్క్ ఉండే గొలుసులను ధరిస్తుంటారు. రంజాన్ సందర్భంగా వరంగల్ మండి బజార్ ప్రాంతం ముస్లింలతో కిక్కిరిసి పోతుంది. వీరి అభిరుచులకు తగినట్లుగా వ్యాపారులు చెన్నై, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, తదితర ప్రాంతాల నుంచి సరికొత్త మోడల్స్‌ను తీసుకొచ్చి అమ్ముతారు. వీటి ధర మాడల్స్, డిజైన్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.10వేల వరకు ఉన్నాయి. అంతే కాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన లహేంగా స్పెషల్ రూ.25వేల విలువైన మాడల్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా వస్త్రాలను కోల్‌కతా, ఢిల్లీ, సూరత్, బొంబాయి, అహ్మదాబాద్ ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నారు.

**చిన్నారుల ఆనందమే నిజమైన పండుగ**

పండుగ వాతావరణం కనిపించేది ముందుగా చిన్నారుల్లోనే. వారి కోసం మార్కెట్లో కళ్లు చెదిరే మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ.500 నుంచి రూ.5వేల వరకు ఉన్నాయి. మోడల్, నాణ్యతను బట్టి ధరలుంటున్నాయి. చిన్నారులకు లాంగ్, షార్ట్ ఫ్రాక్‌లు చాలా ఉంటాయి. ఇందులో నెట్టెడ్, తదితర డ్రస్సులకు నేడు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. జీన్స్ ప్యాంట్‌తో ప్రత్యేకమైన టాప్‌తో పిల్లలు చాలా ఆనందంగా, అందంగా కనిపిస్తారు. ఇక ఫ్యాన్సీ డ్రెస్సుల సంగతి చెప్పనక్కర్లేదు. వీటిలో సుమారు 50 నుంచి 100 మాడల్స్ వరకు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వరంగల్ మండిబజార్ సహా వరంగల్, హనుమకొండల్లోని పలు షాపింగ్ మాల్స్, దుకాణాల్లో షాపింగ్ సందడి కనిపిస్తోంది.





అమ్మకానికి సిద్ధంగా ఉన్న డ్రెస్‌లు



పలు రకాల మోడల్ డ్రెస్సులు

---

## మండు వేసవిలోనూ.. గంగమ్మ గలగల

- బోరు బావుల్లో నుంచి ఉబికి వస్తున్న జలధారలు
- సీజన్ ఏదైనా నిరంతరం నీటి లభ్యత
- గిరిజన రైతులకు తీరుతున్న సాగు, తాగునీటి కష్టాలు




తొండ్యాల లక్ష్మీపురంలో బోరు నుంచి ఉబికి వస్తున్న జలధార

మంగపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు మండు టెండలు, మరోవైపు తాగునీటికి అవస్థలు. గొంతు తడుపుకుందామంటే గుక్కెడు నీళ్ల దొరకని పరిస్థితి. ఒక్కమడి తడుపుదామన్నా చుక్క నీరు అందని దుస్థితి. తలాపున జీవనదులున్నా తప్పని తండ్లాట. బిందెడు నీటి కోసం కిలో మీటర్ల కొద్దీ కాలినడకన వెళ్లి చెలిమెలను ఆశ్రయించాల్సిందే. అయితే ఇలాంటి సమస్య లేనే లేదని అంటున్నారు మంగపేట మండలంలోని తొండ్యాల లక్ష్మీపురం గ్రామ గిరిజనులు. నీటి కటకట అంటే ఏమిటో తమకు తెలియదంటున్నారు. ప్రకృతి సిద్ధంగానే నిరంతరంగా తాము నీటి సౌకర్యాన్ని పొందుతున్నామని చెబుతున్నారు. సీజన్ ఏదైనా నీటికి కరువు లేదని అంటున్నారు. వేసవిలోను పుష్కలంగా నీళ్లు దొరుకుతున్నాయని గిరిజనులు ఆనందంగా చెబుతున్నారు. మంగపేట మండలంలోని తొండ్యాల లక్ష్మీపురం శివారులో పాతాళ గంగ ఎగిసి పడుతోంది. మోటర్ అవసరం లేకుండానే బోరుబావుల్లో నుంచి నిరంతరంగా జలధార ఉబికి వస్తూనే ఉంది. గ్రామానికి కుడివైపు భాగాన ఇలాంటి బోర్లు 16కు పైగా ఉన్నాయి. ఈ గ్రామంలో కుడివైపు పొలాల్లో ఉన్న 300 అడుగులపైగా బోర్ల నుంచి ఆశ్చర్యంగొలిపేలా నీరు ఉప్పొంగుతోంది. ఈ గ్రామ తీరంలో చమురు నిక్షేపాల కోసం 32 ఏళ్ల క్రితం మొదటిసారిగా పొదెం లక్ష్మయ్య అనే గిరిజన ఉద్యోగి సాగు భూమిలో బోరు వేయగా.. చమురు ఆనవాళ్లు లభించకపోయినా గోరువెచ్చటి నీరు ఉబికి వచ్చినట్టు కొందరు చెబుతున్నారు. ఆ తర్వాత ఏటూరునాగారం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటైన తర్వాత గిరిజన రైతులకు సాగునీటి అవసరాలు తీర్చేందుకు రెండు బోరు బావులను తవ్వించారు. ఈక్రమంలో తొండ్యాల లక్ష్మీపురంలో 300లోతు తవ్వగానే జల తాకింది. అంత లోతు నుంచి కూడా మోటర్ అవసరం లేకుండానే నిరంతరం నీరు ఉబికి వస్తుండటం విశేషం. ఇదేక్రమంలో వైఎస్ఆర్ హయాంలో ఇందిర జలప్రభ పేరుతో గిరిజన రైతులకు ఆరు బోర్లను తవ్వించగా అక్కడ కూడా ఇదేవిధంగా పాతాళం నుంచి ఎగిసిపడింది. ఇలా సుమారు 16 బోర్ల నుంచి నిరంతరంగా నీరు వస్తూనే ఉంది. వీటి కింద సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో వరి రెండు పంటలు సాగవుతోంది. కరెంట్ కష్టాలు, మోటర్లు కాలిపోవడం లాంటి సమస్యలు లేకుండానే గిరిజన రైతులు ఈ జలధారలతో పంటలు పండించుకొంటున్నారు. కొందరు ఈ నీటిని తాగడానికి కూడా వినియోగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అవక్షేప శిలాజాలు ఉన్నాయని, అందుకే అక్కడ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయని, బోర్లు వేసినప్పుడు భూమి పొరలోపల శిలాజాలు ఉన్నా. నీరు బయటకు వస్తుందని కాకతీయా యూనివర్శిటీ జువాలజీ ప్రొఫెసర్స్ కొందరు చెబుతున్నారు. బోరు ఉపరితల భాగం కంటే శిలలు ఇంకా ఎత్తులో ఉండటం వలన ఆ ఒత్తిడికి నీరు పైకి ఉబికి వస్తుందని. ఇది ఎక్కువగా అవక్షేప స్థితిలో ఉన్నటువంటి ప్రాంతంలో కనబడుతుందని వాటిని ఆర్టేషన్ బోర్లు అంటారని ప్రొపెసర్లు చెబుతున్నారు.



ఉబికి వస్తున్న నీటిని పైప్‌తో పంటలకు తరలిస్తున్న రైతులు

**బోరు బావులను గిరిజన రైతులకు మంజూరు చేయాలి**



నీరు సమృద్ధిగా ఉబికి వస్తుంది కాబట్టి గ్రామ శివారులో గల భూములున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బోరుబావులను మంజూరు చేస్తే బాగుంటుంది. ప్రభుత్వం సర్వేలు చేసి బోరుబావులను మంజూరు చేస్తే రెండు పంటలతో పాటు నీటి కొరత లేకుండా అవుతుంది. దీని కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

జబ్బ సమ్మయ్య, రైతు, తొండ్యాల లక్ష్మీపురం

## ఆశా వర్కర్ల నిరసన

ములుగు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరుతో నిర్బంధ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆశా వర్కర్లు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ములుగులోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ముఖ్య అతి థిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమా వేశాలు జరుగుతున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌కు బయల్దేరిన ఆశా వర్కర్లను పోలీసులచే అరెస్టు చేయించడం, గృహనిర్బంధం, లాఠీచార్జి చేయడం తగదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనట్ల యితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడ తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సద్దాం హుస్సేన్, ఆశా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, ఆశాలు చుంచు మంజుల, యశోద, రమ, పద్మ, కవిత, రజిత, స్వప్న, లక్ష్మి, సమ్మక్క, విజయ పాల్గొన్నారు.



ములుగులో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

## రోగాలు తెచ్చిపెడుతున్నా ఎందుకింత మక్కువ?


రాఘవపూర్‌లో కోనోకార్పస్ చెట్లు

టేకుమట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోనోకార్పస్ చెట్లతో ప్రజలకు ఆరోగ్యానికి ముప్పని తెలిసిన అధికారులు ఎందుకు తొలిగించడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోనోకార్పస్ మొక్కలు వల్ల ప్రజలకు గానీ, పక్షుల గానీ ఎలాంటి ఉపయోగం లేదు. పైగా ముప్పే ఉంది. ఆ మొక్కల నుంచి వచ్చే పుప్పొడి వల్ల ఆస్తమా, అలర్జీ వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తాయని వృక్ష శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా కోనోకార్పస్ మొక్కల వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. వాటిని వెంటనే తొలిగించాలని సూచించారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి మండల వ్యాప్తంగా ఉన్న కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలిగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రామప్ప ఆలయాన్ని సందర్శించిన ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి


శిల్పకళా సంపదను తలకిస్తున్న లచ్చిరెడ్డి

వెంకటాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని బుధవారం తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక తహసీల్దార్ గిరిబాబు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న లచ్చిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్ర సాదాలు స్వీకరించారు. అనంతరం శిల్పకళా సంపదను వీక్షించి మంత్ర ముగ్ధులయ్యారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకున్న ఆయన బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను తిల కించారు. ఆయన వెంట స్టేట్ మెంబర్లు, స్థానిక రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన ప్రకాశ్‌రెడ్డి


మీనాక్షి నటరాజన్‌తో ప్రకాశ్‌రెడ్డి తదితరులు

కృష్ణకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్‌ను రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి ఢిల్లీలో బుధవారం కలిశారు. ఆలిండియా యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రకా శ్‌రెడ్డి వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ తదితరులు ఉన్నారు.

## 'రాజీవ్ యువ వికాస్' దరఖాస్తులు స్వీకరించాలి

### అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికసాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువవికాస్ స్వీకరించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ అధికారులతో ఆయన బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజీవ్ యువ వికాస్ పథకంపై మాట్లాడారు. రాజీవ్ యువవికాస్ పథకంలో సుమారు 75 రకాల యూనిట్ల ఏర్పాటుకు అర్హులైనవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి యువత టీజీఓబీఎంఎంఎస్.జీజీ.జీఓవీ.ఇన్ సైట్‌లో ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అనంతరం ఫారాన్ని ఎంపీడీవో, మునిసిపాలిటీ కార్యాలయాల్లో అందజేయాల న్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కాటారం, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసులు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సీఐ నాగార్జునరావు ఆదేశాల మేరకు ఎస్సై-2 శ్రీనివాస్ పలు గ్రామాలకు చెందిన ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మొద్దని, ఫోన్లలో వచ్చే అన్ని సందేశాలను ఆచరించొద్దని, ఓటీపీలు ఎవరడగినా చెప్పొద్దని అన్నారు. సైబర్ నేరాలు జరిగినట్లయితే వెంటనే 1930నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పి ఫిర్యాదు చేయాలన్నారు. డబ్బుల విషయమై తెలియని వ్యక్తులను ఆశ్రయించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సివిల్, టీజీఎస్‌పీ పోలీసులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా మినీ మేడారం జాతర ప్రారంభం


పసుపు, కుంకుమలతో పూజలు చేస్తున్న భక్తులు

కాటారం, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాదరావుపేట గ్రామ పంచాయతీ పరిధి రఘుపల్లి అటవీప్రాంతం సమీపంలో ఫైలమ్మ చెల్కలో మినీ మేడారం జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రఘుపల్లి శివారులో గత 40ఏళ్ల క్రితం వెలసిన సమ్మక్క, సారలమ్మ జాతరను బీజేపీ రాష్ట్ర నేత గోమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. జాతర మొదటి రోజు మేడారం పూజారులు సిద్దబోయిన లక్ష్మణ్‌రావు, చందా హన్మంతరావు, ఆలయ పూజారులు జంబుల పోచయ్య, పెరుమాండ్ల లచ్చయ్య ఆధ్వర్యంలో సారలమ్మను అడవుల్లోని కంకవనం నుంచి గద్దెకు చేర్చారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య గ్రామస్తులు, భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు చేసి కొబ్బరి కాయలు బెల్లం సమర్పించి మొక్కుకున్నారు. యాటలను బలిచ్చారు. గురువారం సమ్మక్క తల్లిని అంగరంగ వైభవంగా గద్దెను తీసుకురానున్నట్టు గోమాస శ్రీనివాస్ కోరారు. ఈ జాతరలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్, నాయకులు గంట అంకయ్య, లింగయ్య, గంట బాపు, శ్రీకాంత్, సుధాకర్, నేతకాని భీమ్ సైనిక్‌దళ్ నేత జవ్వాజి తిరుపతి, నేతకాని సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు రాజ్‌కుమార్, గోమాస విక్రమ్, సమ్మక్క, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన

కాటారం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుసాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ కుమారస్వామి మిషన్-95 క్యాంపెయినింగ్‌లో భాగంగా ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నాలుగు విధాలుగా సోకు తుందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గర్భిణులు తప్పకుండా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో స్టాఫ్ నర్స్ నేహా, ఓఆర్‌డబ్ల్యూపీలు భద్రయ్య, నిర్మల, రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

చిట్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చింతల్లపల్లిలో గ్రామ దేవత పోచమ్మతల్లి బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకుని మహిళలు బయల్దేరారు. శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలు, డప్పు చప్పుళ్లతో గ్రామ శివారులోని పోచమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. గ్రామస్థులంతా అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి, బెల్లం పాక, తాటికల్లు, కోడి, మేకలు, గొర్రెలతో మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు దిగుబడి రావాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని నైవేద్యాన్ని సమర్పించారు.

## మండల స్థాయి ప్రత్యేక సమీక్ష

కాటారం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల స్థాయి ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీవో అడ్డూరి బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ లోకిలాల్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ తదితరులు పలు అంశాలపై సమీక్షించారు. మండల అధికారులు గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, రెవెన్యూ, ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో మంచినీటి సమస్యలు, ఉపాధిహామీ, ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రగతి, ఎల్ఆర్ఎస్, ఇంటి పన్నుల వసూళ్లు, నూతన రేషన్‌కార్డులు, పీడీఎస్ సన్న బియ్యం సరఫరా, రాజీవ్‌యువ వికాసం పథకాలపై సమీక్షించారు. గ్రామాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకన్న, కార్యదర్శులు, టీఏలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు

## జాతీయ సదస్సులో పాల్గొన్న రామయ్య


సదస్సులో మాట్లాడుతున్న రామయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని అబ్బాపూర్ జడ్పీహెచ్ ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచే స్తున్న మనో వైజ్ఞానికశాస్త్ర పరిశోధకుడు, రిసోర్స్‌పర్సన్, ఎస్‌సీఈఆర్‌టీ జాతీయ మెంటర్ డాక్టర్ కందాల రామయ్య భోపాల్‌లో ఈనెల 24,25 తేదీల్లో జరి గిన జాతీయ వికసిత్ భారత్ సదస్సులో పాల్గొన్నారు. 'కౌమార విద్య, సమస్యలు, సవాళ్ల, పరిష్కారాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 'కౌమారదశలో గల బాలికల్లో ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు' అనే పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా రామయ్య పలు సిఫారసులు చేయగా ఆర్ఐఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయదేవ్ మోండల్, ప్రొఫెసర్ బుర్రా రమేష్‌బాబు, సదస్సు సమన్వయకర్త, ప్రొఫెసర్ రష్మిసింగ్ ప్రశంసించారు.

## నాలుగు ఇసుక లారీల పట్టివేత

ఏటూరునాగారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో తరలిస్తున్న నాలుగు ఇసుక లారీలను పోలీసులు, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా పట్టుకున్నారు. మంగళవారం రాత్రి ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ ప్రాంతాన పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధిక లోడుతో తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకున్నారు. అంతేకాకుండా బుధవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మక్కపేట ఇసుక ర్యాంపు నుంచి మరో రెండు ఇసుక లారీలు అధిక లోడుతో తరలిస్తుండగా మండలంలోని చిన్నబోయినపల్లి వే బ్రిడ్జి వద్ద తూకం వేయగా అధికలోడు ఉన్నట్లు తెలింది. దీంతో జూనియర్ అసిస్టెంట్ గంపట శంకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు లారీలను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఉరేసుకొని గిరిజనుడి ఆత్మహత్య

మంగపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : చెట్టుకు ఉరేసుకొని గిరిజనుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండలంలోని నిమ్మగూడెం గ్రామ పంచాయతీపరిధి కొత్తనిమ్మగూడెంకాలనీకి చెందిన మద్దెల చందర్‌రావు(35) మద్యం సేవించి జూలాయిగా తిరిగేవాడు. కుటుంబ సభ్యులు మద్యం మాన్పించారు. చాలా రోజుల మద్యం మానేసి కూలి పనులు చేసుకొని కుటుం బంతో సంతోషంగా ఉండేవాడు. రెండు రోజుల నుంచి మళ్లీ మద్యం తాగడం ప్రారంభించాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో పలువురితో గొడవలకు దిగేవాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తిచెంది సంఘంపల్లి, పూరేడుపల్లి గ్రామాల మధ్యలో ముసలమ్మవాగు ఒడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామ యువకులు గ్రహించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమా చారం ఇచ్చారు. మృతుడి భార్య త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటన ప్రదేశానికి వెళ్లి పంచానామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాలను కొనసాగించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్, గౌరవ అధ్యక్షుడు బండి రాజులు పిలుపునిచ్చారు. ఉగాది పర్వదిన తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో మెపా నూతన క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి సింగారపు రామకృష్ణ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు భూమ నరేష్ పాల్గొన్నారు.

## ముఖాముఖి

డాక్టర్ సురేష్ కుమార్,
సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, ఏటూరునాగారం



### మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

**ఆంధ్రజ్యోతి** : ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు అందబాటులో ఉన్నాయి?

**సూపరింటెండెంట్** : త్యవసర విభాగం, ఇంటెన్సివ్ యూనిట్, ఆపరేషన్ థియేటర్లు, ప్రయోగశాలలు, ఫార్మసీ, అంబులెన్స్ సేవలు ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి** : ఆస్పత్రిలో పరిశుభ్రత, రోగుల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**సూపరింటెండెంట్** : పరిశుభ్రత, రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. వైద్య సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తారు. రోగుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

**ఆంధ్రజ్యోతి** : సిబ్బంది పనితీరు ఎలా ఉంది?

**సూపరింటెండెంట్** : ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉత్తమమైన సంరక్షణ లభిస్తుంది. వైద్య సిబ్బంది రోగుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, వారికి అన్ని విధాలుగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

**ఆంధ్రజ్యోతి** : వడదెబ్బ తగలకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**సూపరింటెండెంట్** : ఎండలో బయట తిరగకూండా ఉంటూ నీరు ఎక్కువగా తాగాలి. వదులుగా ఉండే దుస్తులు ధరించి, శరీరాన్ని చల్లబరిచే పండ్లను, కూరగాయలను తీసుకోవాలి.

- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి)

## సెలూన్ షాపుల బంద్ విజయవంతం

చిట్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం పిలుపు మేరకు మండల వ్యాప్తంగా సెలూన్ షాపులు బుధవారం బంద్ పాటించాయి. ఈసందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు మేడిపెల్లి శ్రీనివాస్ మాట్లా డుతూ కుల వృత్తి ఆదారంగా బతుకుతున్న తమకు పోటీగా వెలుస్తున్న కార్పొరేట్ సెలూన్ షాపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం సభ్యులు తూముల సంజీవ్, మాదాసు నాగరాజు, దేవేందర్, తూముల శైలేందర్, రాజుకుమార్, రమేష్, భానుచందర్, నాగవంశీ, భూపతి, శివాజీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### మల్హర్ మండలంలో..

మల్హర్ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న కార్పొరేట్ సెలూన్‌తో తమ ఉపాధి దెబ్బతింటుందని నాయీ బ్రాహ్మణులు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, కొయ్యూర్‌లో సెలూన్ షాపులను మూసివేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుపై రాయితీ

కృష్ణకాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలో బకాయిలు ఉన్న ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీని మినహాయింపు ఇస్తున్న ట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం ద్వారా పన్ను చెల్లింపుదారులు ఈ రాయితీని పొందొచ్చని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం స్పెషల్ డ్రైవ్

ములుగు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని జంగాలపల్లి జంక్షన్, పెట్రోల్‌బంకు, కాసిందేవిపేట క్రాస్ రోడ్లలో డివైడర్లపై ఏర్పాటు చేసిన ఐరన్ బారికేడ్లను తొలగించారు. ఈసందర్భంగా డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ 163వ జాతీయ రహదారి డివైడర్లలో బారికేడ్లు ఉండడం మూలంగా రోడ్డు క్రాస్ చేసే వాహనదారులకు ఇతర వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని బారికేడ్లను తొలగించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'ను విస్తృతపరచాలి : జవహర్ లాల్

గోవిందరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం-ఒకే ఎన్నిక అంశాన్ని గ్రామస్థాయిలో విస్తృతపరచాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ నాయకులు, కార్యకర్తలకు అన్నారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మార్క సతీష్ అధ్యక్షతన 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'పై బుధవారం జరిగిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఒకే దేశం - ఒకే ఎన్నికఅనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీంతో ఒకేసారి ఎన్నికలు జరిగితే దేశం ఆర్థికంగా, అభివృద్ధిపరంగా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉంటుందని అన్నారు. ప్రజల ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకులు అధికారంలోకి వస్తారని, ఎలాంటి ఎన్నికల కోడ్ ఆంక్షలు లేకుండా దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నికపై పార్టీలకతీతంగా యువకులు, మేధావులు ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవింద్రచారి, జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందా జ్యోతి, నాయకులు కొత్త సుధాకర్‌రెడ్డి, పసుల బాబూరావు, వలుపదాసు రవిశంకర్, మేరుగు సత్యనారాయణ, కర్ర సాంబశివరెడ్డి, రాజన్న, యార్లగడ్డ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

మంగపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, గంపోనిగూడెం, బోరున ర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. కార్యకర్తలను కలిసి పలు అంశాలపై చర్చించారు. పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు అహర్నిషలు కృష చేయాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, మండల మాజీ అధ్యక్షుడు కునూరు మహేష్, అనుబంధ సంఘాల నాయకులు తుక్కాని శ్రీనివాస్, చిట్టిమల్ల సమ్మయ్య, తిరుపతి, మోహన్, వై. శ్రీనివాస్, మురళి, వెంకట్‌రెడ్డి, సత్యం, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఎంపీపీ ఇంటిపై దాడి

### కారు అద్దాలు ధ్వంసం


ధ్వంసమైన కారు అద్దాలు

ములుగు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం ఖాసిందేవిపేటకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ దేవరనేని స్వామిరావు ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. స్వామిరావు ములుగులో పని ముగించుకొని అదేరోజు రాత్రి ఇంటికి వెళ్తున్నక్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారును అడ్డగిం చడంతో ఇరువురి మధ్య చిన్నపాటి గొడవ జరి గింది. స్థానికులు సర్దిచె ప్పడంతో సద్దుమణిగింది. ఆ తర్వాత పంటచేను కాపలా కోసం తాను వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి తలుపులు కొట్టారని, ఇంటి ఆవరణలో ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశారని స్వా మిరావు తెలిపారు. ఈవిషయమై ములుగు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గోదావరి జలాలతో శివాలయం శుభ్రం


వాజేడులోని శివాలయం

వాజేడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో 17 ఏళ్లగా మూతపడిన శివాలయంను తెరిచేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక యువత ఆలయాన్ని ఎలాగైన తెరవాలని పట్టుదలతో ఉండగా కొన్ని రోజులుగా శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయం పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ క్రమంలో బుధవారం ఆలయాన్ని గోదావరి జలాలతో శుభ్రం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి బిందెలతో గోదావరి జలాలను తీసుకొచ్చి శుభ్రం చేశారు. ఆలయం గర్భగుడిని తెరిచి శివాలింగం, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను జలాలతో శుభ్రపరిచారు. త్వరలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాన్ని పూర్తి స్థాయిలో తెరుస్తామని ధర్మకర్త తెలిపారు.

## అంకంపల్లిలో వాలీబాల్ క్రీడలు

తాడ్వాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లి గ్రామంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మల జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడలు బుధవారం ముగిశాయి. విజేతలకు రూ. 10వేల బహుమతిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసరి సూర్య చేతుల మీదుగా అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, నాయ కులు అరెం లచ్చు పటేల్, ఎండీ ముజఫర్, మంకిడి నర్సింహస్వామి, యా నాల సిద్దిరెడ్డి, పల్నాటి సత్యం, ముత్తి రామస్వామి, ఇర్సవడ్ల నారాయణ, మంకిడి సమ్మయ్య, ఇర్ప వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

## చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం దృష్ట్యా జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ రవీందర్ అన్నారు. బుధవారం ములుగు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ కాంప్లెక్స్‌లోని వివిధ షాపుల యజమానులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, వివిధ షాపుల యజమానులు మాట్ల బద్రి, శ్రీనివాస్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

ములుగు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈనెల 28న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఎం.సంపత్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలసేమియా బాధితుల కోసం నిర్వహించే శిబిరంలో యువత, ఉద్యోగులు, పాత్రికేయులు, రక్తదాతలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.